క్లుప్తంగా

ఆర్థికసాయం



టేకుమట్ల : మండలంలోని పెద్దంపల్లి గ్రామానికి చెందిన శాస్త్రాల కొమురయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి అంబేడ్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నేరేళ్ల రామకృష్ణగౌడ్ 25 కిలోల బియ్యం, ఆర్థికసాయం అందజేశారు. మాజీ సర్పంచ్ వసంతసారయ్య, ఎమ్మార్పీఎస్ నాయకులు ఎల్కటి రాజయ్య, ఏవైఎస్ మండల అధ్యక్షుడు ఆరకొండ రాజయ్య, శాస్త్రాల కిరణ్, కనుమరుగుల సంపత్, రవీందర్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక



రేగొండ: మండలంలోని కొడవటంచ గ్రామంలో గురువారం గౌడ సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌడ సంఘం అధ్యక్షుడిగా గైని విజేందర్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గౌడ కులస్తుల సమస్యల పరిష్కారానికి కృషి చూస్తానని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు బోడిగే భాస్కర్, కక్కర్ల సంజీవ్, గైని కుమారస్వామి, సదానందం, కుమార్, రజినీకాంత్, పానీ, రాము, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

రావణాసుర వధ ఉత్సవ స్థలం పరిశీలన

ములుగు: జిల్లా కేంద్రంలోని ధర్మ జాగరణ సమితి ఆధ్వర్యంలో విజయదశమి వేడుకల సందర్భంగా రావణాసుర వధ కోసం ఉత్సవ స్థలాన్ని గురువారం ఎస్సై వెంకటేశ్వరరావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కమిటీ సభ్యులతో మాట్లాడుతూ.. ఉత్సవాలకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఉత్సవ స్థలంలో విద్యుత్ సౌకర్యంలో పాటు అగ్నిమాపక శకటం, అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గంద్రకోట కుమార్, ఉపాధ్యక్షుడు ఓడ రాజు, కొత్త సురేందర్, గందె రాజు, మాదారి జనార్ధన్, జర్పల పవన్, బూమా నరేష్, తదితరులు ఉన్నారు.


మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఆత్మకూరు : మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్ అన్నారు. మండల కేంద్రంలోని స్వర్ణభారతి మహిళా సమాఖ్యలో గురువారం మహిళలకు లింగాధారిత హింస నివారణపై శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. మహిళలు రక్షణ చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. ఐకేపీ ఏపీఎం లలితాదేవి, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు రజిత, అరుణ ఉన్నారు.

నాపాక ఆలయంపై నిర్లక్ష్యం?

- శిథిలావస్థకు చేరుకున్న పురావస్తు గుడి
- పట్టించుకోని అధికారులు

చిట్యాల: మండలంలోని నైన్‌పాక గ్రామంలో వెలసిన సర్వతోభద్ర(నాపాక) ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. ఎంతో మంది చరిత్రకారులు, శిల్పులు సంవత్సరాల తరబడి ఏకశిలా రాతి కొండను ఆలయంగా మలిచిన నాపాక ఆలయంపై పాలకులు, పురావస్తు శాఖ, ఎండోమెంట్ శాఖ అధికారులు నిర్లక్ష్యం ఎందుకు చేస్తున్నారో అర్థంకావడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షానికి ఆలయం లోపల మొత్తం కురుస్తుందని అర్చకులు తెలిపారు. ఆలయంపైన మొక్కలు పెరిగి ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని దుస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. సుమారు వెయ్యి సంవత్సరాల చరిత్ర కలిగిన నాపాక సర్వతోభద్ర ఆలయం కాలగర్భంలో కలిసిపోతున్న తరుణంలో అప్పటి మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి ఆలయాన్ని వెలుగులోకి తీసుకొచ్చి రూ.మూడు కోట్ల నిధులు కేటాయించారు. కాని అప్పటి నుంచి పాలకులు, పురావస్తు శాఖ అధికారులు, ఎండోమెంట్ అధికారులు కనీసం ఆలయాన్ని పట్టించుకున్న పాపాన లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నాపాక ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఇంత వరకు పనులు ప్రారంభించలేదని గ్రామస్తులు తెలిపారు. ఆలయం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్తులు తెలుపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యం మూలంగానే ఆలయ పనులు ప్రారంభం కావడం లేదని ఆరోపిస్తున్నారు. దక్షిణ భారతదేశంలోనే మొదటి ఏకశిలా ఆలయంగా పేరుగాంచిన నాపాక ఆలయానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు చొరవ చూపి మరమ్మతు చేయాలని డిమాండ్ చేశారు.



శిథిలావస్థకు చేరుకున్న నాపాక ఆలయం

మతోన్మాద విధానాలను తిప్పికొట్టాలి



మాట్లాడుతున్న బందు సాయిలు

చిట్యాల: బీజేపీ మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు అన్నారు. గురువారం మండలంలోని కైలాపూర్ శివారు శాంతినగర్‌లో మండల కమిటీ ఆధ్వర్యంలో మూడవ మహాసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బందు సాయిలు హాజరై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం మతోన్మాద ప్రజావ్యతిరేక విధానాలను అవలంభిస్తూ ప్రజా ప్రయోజనాలకు, దేశ అభివృద్ధికి తీరనినష్టం చేస్తుందని మండిపడ్డారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన నుంచి దళితులపై, ఆదివాసులపై, కార్మికులపై, పేద ప్రజలపై దాడులు చేస్తూ దౌర్జన్యాలు కొనసాగిస్తున్నారని ఆరోపించారు. బీజేపీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు చింతల రజినీకాంత్, గుర్రం దేవేందర్, రమేష్, భూక్యా నవీన్, వినోద్, రాజమణి, కుమార్, కల్పన , రమేశ్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

చలివాగు ప్రాజెక్టులో చేపపిల్లల విడుదల

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని చలివాగు ప్రాజెక్టులో మత్స్య సొసైటీ ఆధ్వర్యంలో గురువారం రూ.12 లక్షల విలువచేసే ఆరు లక్షల చేపపిల్లలను సొసైటీ చైర్మన్ గండి రాజమౌళి, పాలకవర్గ సభ్యుల సమక్షంలో విడుదల చేశారు. ఎస్సై ప్రమోద్‌కుమార్ హాజరై చేపపిల్లను ప్రాజెక్టులోకి వదిలారు. చేపల పట్టేందుకు కాంట్రాక్టర్ వ్యవస్థను తొలగించాలని మత్స్యకారులు ఇటీవల ప్రకటనలు చేయగా స్పందించిన సొసైటీ చైర్మన్ రాజమౌళి పాలకవర్గ సభ్యులు, సంఘ సభ్యులతో మాట్లాడారు. సొసైటీ ద్వారానే 30 లక్షల రూపాయల రుణాలు తీసుకొచ్చి చేప పిల్లలను ప్రాజెక్టులో పోయాలని తీర్మాణించారు. దీంతో గురువారం ఆరు లక్షల చేపపిల్లలను ప్రాజెక్టులో విడుదల చేసినట్లు తెలిపారు. త్వరలో మరిన్ని పిల్లలను ప్రాజెక్టులో విడుదల చేస్తామని చైర్మన్ తెలిపారు. చేపలు పట్టేందుకు కాంట్రాక్టుకు ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. సంఘ సభ్యులు కట్టిన రుసుము ప్రకారం 13 గ్రామాలకు చెందిన 1,276 మంది సంఘ సభ్యులకు చేపల ద్వారా వచ్చే ఆదాయాన్ని సమానంగా పంచుతామన్నారు. సొసైటీ ఉపాధ్యక్షుడు రాజు, ప్రధాన కార్యదర్శి నరేష్, డైరెక్టర్లు తిరుపతి, సురేష్, ఆనంద్, తిరుపతి, మాజీ డైరెక్టర్‌లు శ్రీధర్, సదయ్య, 13 గ్రామాల సంఘ సభ్యులు పాల్గొన్నారు.



చలివాగు ప్రాజెక్టులో చేపపిల్లలను వదులుతున్న ఎస్సై ప్రమోద్‌కుమార్, చైర్మన్ రాజమౌళి

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



భూపాలపల్లి రూరల్: శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



వెంకటేశ్వర్లపల్లిలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు తెలిపారు. పట్టణంలోని కాకతీయ కాలనీ, ఎల్‌బీనగర్, శాంతి నగర్, హనుమాన్ నగర్, జంగేడు రోడ్డు, బానోత్ వీధిలో సుమారు రూ.1 కోటి 76 లక్షల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధి కోసం శక్తివంచన లేకుండా పనిచేస్తున్నాని తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతతో త్వరితగతిన పూర్తి చేయించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో జెడ్పీ సీఈఓ, జిల్లా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, అధికారులు, కాంగ్రెస్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

తీజ్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

భూపాలపల్లి పట్టణంలోని బానోత్ వీధితోపాటు హనుమాన్‌నగర్, భూపాలపల్లి మండలంలోని గొల్ల బుద్దారం గ్రామంలో నిర్వహించిన తీజ్ వేడుకల్లో ఎమ్మెల్యే సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల బంజారా మహిళలు , నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీక తీజ్

రేగొండ(కొత్తపల్లిగోరి): తీజ్ ఉత్సవాలు లంబాడీల సంస్కృతీ, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం కొత్తపల్లిగోరి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామంలో నిర్వహించిన లంబాడీల తీజ్ వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం కోసం సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గూటోజు కిష్టయ్య, మాజీ జెడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు సూదనబోయిన ఓంప్రకాశ్, వెంకటేష్, చిగురుమామిడి కుమారస్వామి, రాజు, వీరబ్రహ్మం, అమ్ముల రాజయ్య పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న మంత్రి సీతక్క

ములుగు రూరల్: మండలంలోని మల్లంపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు నూనెటి అయిలయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క గురువారం పరామర్శించారు. అయిలయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి పార్టీ ఎల్లవేళల అండగా ఉంటుందని అన్నారు. ఆమె వెంట పార్టీ జిల్లా, మండల నాయకులు ఉన్నారు.

నివాళి

మండలంలోని బండారుపల్లి గ్రామానికి చెందిన ఉమ్మడి జిల్లా మాజీ రైతు కూలీ సంఘం నాయకుడు గన్నెర్ల భాస్కర్ అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని పూర్వ పీడీఎస్‌యూ నాయకులు గురువారం పరామర్శించి భాస్కర్ మృతదేహానికి ఎర్ర జెండాలు కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముంజాల భిక్షపతి మాట్లాడుతూ.. రైతుకూలీ సంఘంలో పని చేసిన క్రమంలో భాస్కర్ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని ప్రజ సమస్యలపై పోరాడారని అన్నారు. నాయకులు పెండెం రాజేందర్, గుగులోత్ సమ్మన్న, నూనె శ్రీనివాస్, బుర్రి దేవేందర్ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

కాళేశ్వరంలో భక్తులపై చిన్నచూపు ఎందుకు?

కాళేశ్వరం: శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సమాచారం తెలియపరచడంలో ఆలయ అధికారులు భక్తులు, గ్రామస్తులపై చిన్నచూపు ఎందుకు ప్రదర్శిస్తున్నారని స్థానిక భక్తుడు కోల మహేష్ గురువారం ఆయన ఒక ప్రకటనలో ఆరోపించారు. దేవస్థానం తరపున ఆహ్వాన పత్రికలు ముద్రించి భక్తులు అధిక సంఖ్యలో వచ్చే విధంగా ప్రచార కార్యక్రమాలు చేయాలి కానీ కాళేశ్వరం ఆలయ అధికారులు కొంత మందికే సమాచారం అందించి మిగతా వారికి ఎలాంటి సమాచారం లేకుండా ఉత్సవాలు జరపడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. దేవస్థానం ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికలు కొంత మందికే ఇవ్వాలి అనేది దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ విధి విధానాలు ఏమన్నా ఉంటే పత్రిక, మీడియా ముఖంగా తెలియజేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి సమాచారం లేకుండా దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం వల్ల భక్తులు తగ్గే అవకాశం ఉందని, అలాగే భక్తుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఆలయ అధికారులు వ్యవహరిస్తున్న తీరు కలచివేసిందని ఆవేదన వ్యక్తం చేశాడు.

క్రైం కార్నర్

బావిలో పడి రైతు మృతి



భూమిరెడ్డి (ఫైల్)

టేకుమట్ల : వ్యవసాయ బావిలోని మోటర్‌ను చైన్‌బ్లాక్ సాయంతో పైకి లాగుతున్న క్రమంలో విద్యుత్ తీగలకు తగిలి రైతు తిప్పిరెడ్డి భూమిరెడ్డి (41) బావిలో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని ద్వారకపేటలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మిరప పంటకు నీరు పెట్టేందుకు బుధవారం భూమిరెడ్డి వ్యవసాయ బావి మోటర్‌ను ఆన్ చేయగా పనిచేయలేదు. దీంతో చైన్‌బ్లాక్ సాయంతో మోటర్‌ను పైకి లాగుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు చైన్‌బ్లాక్ విద్యుత్ తీగలకు తగలడంతో విద్యుదాఘాతానికి గురై బావిలోనే పడిపోయినట్లు తెలిపారు. అక్కడే ఉన్న భూమిరెడ్డి భార్య కుటుంబ సభ్యులకు తెలపడంతో బావిలో నీటిని తోడి మృతదేహాన్ని బయటికి తీసినట్లు తెలిపారు. గురువారం మృతుడి భార్య దేవకి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రసాద్ తెలిపారు.

పురుగుల మందు తాగి గీత కార్మికుడు..

మొగుళ్లపల్లి : పురుగుల మందు తాగి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పెద్దకోమటిపల్లిలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పెద్దకోమటిపల్లికి చెందిన గడ్డం చిన్నకొమురయ్య(52) గురువారం గ్రామ శివారులోని ఓ రైతుకు చెందిన పశువుల కొట్టంలో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వెతకగా, అప్పటికే కొమురయ్య మృతిచెంది ఉన్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతిగల కారణాలు తెలియాల్సి ఉంది.

విద్యుత్ తీగలు తగిలి మహిళ..



విద్యుత్ తీగలు తగిలి మృతిచెందిన సుక్కక్క

భూపాలపల్లి రూరల్ : విద్యుత్ తీగలు తగిలి మహిళ మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలంలోని కమలాపూర్‌లో చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కమలాపూర్ గ్రామానికి చెందిన గంట సుక్కక్క (38) గురువారం వ్యవసాయ పనికి వెళ్లింది. గతంలో పత్తి చేనుకు రక్షణగా విద్యుత్ తీగలతో పాటు సోలార్ తీగలను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఈ క్రమంలో పత్తి చేనులోకి కోతులు రావడంతో సోలార్ తీగలకు బదులుగా, విద్యుత్ తీగలకు విద్యుత్ తగిలించింది. మళ్లీ పనిలో నిమగ్నమైన ఆమె పని చేస్తునే ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తాకింది. దీంతో ఆమె అక్కడే కుప్పకూలిపోయి అస్వస్థత గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి భర్త, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గంజాయి పట్టివేత

మొగుళ్లపల్లి: మండల కేంద్రానికి గంజాయి తరలిస్తున్న యువకుడిని గురువారం మధ్యాహ్నం పట్టుకొని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండారి వినయ్ అనే యువకుడు హనుమకొండ జిల్లా నడికుడ మండలం వరికోలు గ్రామం నుంచి పావు కిలో ఎండు గంజాయి తీసుకొని ఆర్టీసీ బస్సులో వస్తున్నాడు. ఈ క్రమంలో పోలీసులకు వచ్చిన సమాచారం మేరకు మొగుళ్లపల్లి గ్రామ శివారులో బస్సు తనిఖీ చేస్తున్న క్రమంలో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడు వినయ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నాడు. గంజాయి విలువ సుమారుగా రూ.5 వేల వరకు ఉంటుందని తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

భూపాలపల్లి రూరల్: విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన భూపాలపల్లి మండలంలోని గొర్లవేడు గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం గొర్లవీడు గ్రామానికి చెందిన రైతు చిలువేరు సమ్మయ్య చెందిన పాడి గేదె రోజువారిలాగే మోరాంచ వాగు ఒడ్డున మేత మేస్తుంది. ఈ క్రమంలో విద్యుత్ మోటార్ల వైర్లు తాకి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. సుమారుగా రూ.70 వేల నష్టం జరిగిందని బాధితుడు సమ్మయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధిపై ప్రశ్నిస్తే కేసులా?



మాట్లాడుతున్న నారాయణరెడ్డి

కాటారం: మంథని నియోజకవర్గంలో అభివృద్ధిపై ప్రశ్నిస్తే తమపై మంత్రి శ్రీధర్‌బాబు కేసులు పెడుతున్నారని బీజేపీ రాష్ట్ర నాయకుడు చల్ల నారాయణరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మంథని అభివృద్ధిపై ప్రశ్నిస్తే తమపై మంత్రి పలు రకాల కేసులు పెట్టిస్తున్నారని అన్నారు. కేసులకు భయపడేది లేదని చట్టపరంగా ముందుకెళ్తామన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు బండం మల్లారెడ్డి, నాయకులు బొమ్మన భాస్కర్‌రెడిడ్డి, సంపత్, అర్జయ్య, తదితరులు పాల్గొన్నారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

మొగుళ్లపల్లి : మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంలో శివరామకృష్ణ భజనమండలి సభ్యుల సేవా సహకారంతో కొలువుదీరిన అమ్మవారు మొదటిరోజు బాలత్రిపురసుందరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శివాలయం దగ్గర కొలువుదీరిన అమ్మవారికి విగ్రహదాత బత్తిని రమేశ్ కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు ప్రసాదలను అందజేశారు.

చిట్యాల: దుర్గామాత ప్రజలను చల్లగా చూడాలని కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముకిరాల మధువంశీకృష్ణ అన్నారు. గురువారం మండలంలోని నైన్‌పాక, చల్లగరిగ, జడలపేట, గోపాలపూర్, చింతలపల్లి, తిర్మలాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని ఆయన దర్శించుకున్నారు. అనంతరం శరన్నవరాత్రుల సందర్భంగా అమ్మవారి అలంకరణకు ఆయా గ్రామాలలో 10 చీరల చొప్పున సమర్పించారు. ఈ సందర్భంగా నైన్‌పాకలోని శ్రీరామకృష్ణ పరమహంస ట్రస్ట్ సభ్యులు శాలువలతో సన్మానించారు. ట్రస్ట్ చైర్మన్ నరేందర్, సభ్యులు నక్క భాస్కర్, పెండెల ప్రభాకరాచార్యులు, స్వామి, కంచర్ల రమేష్, సుదగాని ప్రభాకర్, నూక వీరయ్య, నాపాక చైర్మన్ యాదండ్ల రాజయ్య, నక్క రవి, చిన్నాల శ్రీనివాస్, నూక రాజు, మహేష్, శివ, రమేష్, సాయి, వెంకటేశ్వర్లు, రవి పాల్గొన్నారు.

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో టస్సర్ కాలనీలో శ్రీ గర్భగౌరీ సంస్థాన్ సేవా సమితి, ఆలయ పురోహితులు మాడుగుల చంద్రశేఖరశర్మ ఆధ్వర్యంలో శ్రీదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో అమ్మవారి విగ్రహానికి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. మొదటి రోజున గర్భరక్షాకరి, సంతానప్రధాయిని శ్రీ గర్భగౌరీ దేవి అలంకరణలో అమ్మవారి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత పెండ్యాల నరసింహా, గర్భగౌరీ సంస్థాన్ సేవా సమితి సభ్యులు మోటం వెంకటేశ్వర్లు,మెరుగు నరసింహస్వామి, కారెంగుల బాపురావు, మెరుగు లక్ష్మణ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండలంలో ఘనంగా దేవీ నవరాత్రి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని బెస్తగూడెం, పాత్రాపురం ఆలుబాక, వెంకటాపురం మండల కేంద్రంలోని పాత మార్కెట్ సెంటర్, శివాపురం వీధి, రజిక వీధి, వేప చెట్టు సెంటర్, దుర్గమ్మ గుడి సెంటర్లలో దేవి నవరాత్రి వేడుకలు ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. మండపాల వద్ద ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.



చిట్యాల: అమ్మవారిని దర్శించుకుంటున్న మధువంశీకృష్ణ, భక్తులు



మొగుళ్లపల్లి: పూజలు చేస్తున్న భక్తులు



మహదేవపూర్: శ్రీగర్భగౌరి అలంకరణలో అమ్మవారు

భూసార పరీక్షలు చేయించుకోవాలి



మట్టి నమూనాలు సేకరిస్తున్న అధికారులు

కన్నాయిగూడెం: రైతులు వ్యవసాయ భూములకు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏఓ మహేష్ అన్నారు. గురువారం మండలంలోని పలు గ్రామాల్లో రైతు పొలాల వద్ద నుంచి మట్టి నమూనాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వ్యవసాయ భూములకు భూ పరీక్ష అనేది శ్రీరామ రక్షలాంటిదని అన్నారు. సేకరించిన మట్టి పరీక్ష వివరాలు దాదాపు నెల రోజుల్లో వస్తాయన్నారు. వాటి ఆదారంగా ఎలాంటి పంటలు వేయాలో తెలియజేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కల్యాణి, ఆస్పిరేషనల్ టెక్నాలజీ అధికారి రాందాస్, ఆస్పిరేషనల్ బ్లాక్ కో ఆర్డినేటర్ రవీష్ పాల్గొన్నారు.